క్లుప్తంగా

బరకసంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామికి బుధవారం అమావాస్యను పురస్కరించుకొని స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, తదితర విశేష పూజలను పురోహితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో మన్యసుక్త హోమం, స్వామి వార్లకు పల్లకీ సేవ కార్యక్ర మం భక్తజనుల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కొలనుభారతిలో వేలాలు

కొత్తపల్లి: మండలంలో వెలసిన కొలనుభారతిదేవి క్షేత్రంలో అంగళ్ల నిర్వహణకు ఈ నెల 9న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మోహన్ బుధవారం తెలిపారు. దేవస్థానంలో టెంకాయలు, మిశ్రమ బియ్యం, కొబ్బరి గిన్నెలు, అక్షరాభ్యాసం, పూజాసామగ్రి సెట్టు అమ్ముకునే హక్కును పొందేందుకు బహిరంగ వేలం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. వేలం దక్కించుకున్న వారికి 19-05-2024 నుంచి 18-05-2025 వరకు అంగళ్లు నిర్వహించుకునే హక్కు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణయించిన మేరకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా దేవస్థానానికి చెందిన సర్వే నంబర్-88లో ఉన్న 1.36 ఎకరాలు మెట్ట భూమికి కూడా వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు శివపురం గ్రామంలో వెలసిన శ్రీ కాంతిస్వామి దేవస్థానమునకు చెందిన భూములను దేవాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. పాటదారులు రూ.2వేలు డిపాజిట్ చేయాలని చెప్పారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కవిరాజ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో నిర్వహించిన ఈ సమావేశానికి ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తాగునీటి సరఫరాపై ఆ శాఖ మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ నివేదికలు వినిపిస్తుండగా కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పగిడ్యాల, పడమర ప్రాతకోట గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొందని చేతి పంపుల మరమ్మతులకు మెకానిక్‌ను పిలిపించాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఇతర సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి




బొల్లవరం జయప్రకాష్(ఫైల్)

పగిడ్యాల: మండల కేంద్రమైన పగిడ్యాల అంబేడ్కర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొల్లవరం జయప్రకాష్ (52) బుధవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేకపోయారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వై. చంద్రమౌళి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు

మహానంది: ప్రతి పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు డీటీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. మంగళవారం ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు.

సంక్షేమ పాలనను ఆదరించండి



ముసలిమడుగులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా

కొత్తపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజలు ఆదరించాలని మాజీ వైస్ ఎంపీపీ శివపురం మహబూబ్ బాషా కోరారు. బుధవారం మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో సర్పంచు శివపురం జమిలాబీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు బంగి నాగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని నందికుంటలో సర్పంచు నిత్యలక్ష్మీదేవి, జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందికుంటలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి

ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను గెలిపిద్దాం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే పథకాలు ఇంటికి వస్తాయి
- ఎన్నికలప్పుడు మాత్రమే ఆర్భాటం చేసే టీడీపీని నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



కోనేటమ్మపల్లి గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, చిత్రంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు రూరల్ : ప్రజలందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గడప వద్దకే పాలనను తీసుకు వచ్చిన జగనన్న రుణం తీర్చుకుందామని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని దామగట్ల, వడ్డెమాను, కోనేటమ్మపల్లి, బిజినవేముల, నాగటూరు, కొణిదేల గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిన తీరును ఒకసారి గుర్తు చేసుకుంటే ఎవరూ ఆయన్ను నమ్మరని చెప్పారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే ఆర్భాటం చేసే టీడీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీకి అధికార దాహం తప్ప ప్రజాసేవపై ఆసక్తి లేదన్నారు. ఈ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ వైపు ప్రజలుంటారన్న జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.

సంక్షేమానికి చిరునామా జగనన్న..

ముఖ్యమంత్రి జగనన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి , సంక్షేమానికి చిరునామాగా నిలిచారని ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రవియాదవ్, సీనియర్ నాయకులు కేశవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, దామగట్ల ఉప సర్పంచ్ ఏసురత్నం వడ్డెమాను నాయకులు కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, కట్టా రవిరెడ్డి, అశోక్‌రెడ్డి, సలాంఖాన్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో శిల్పా కార్తీక్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మున్సిపల్ చైర్మన్

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి సమక్షంలో రజకులు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరడం నచ్చి పార్టీలోకి చేరడం జరిగిందన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలరు మంగళి కృష్ణ ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన రవిశంకర, శివ, వెంకటేశ్వర్లు, మల్లయ్య, మహాదేవుడు, మనోహర్, మాస్, రమేష్, గణేష్, వెంకటరమణ, ప్రకాష్, సురేంద్ర, శ్రీను, చరణ్, నరేష్‌తో పాటు మరికొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మున్సిపల్ చైర్మన్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

నందికొట్కూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గవర్నమెంట్ హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం ఓట్లు 2,603 మంది ఉద్యోగులకు గాను ఇప్పటి వరకు 2,529 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునట్లు ఆర్‌ఓ దాసు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోలేక పోయినవారు గురువారం 9వ తేదీ చివరి రోజు బాలికల ఉన్నత పాఠశాలలో తమ ఓటు వినియోగించుకోవచ్చని చెప్పారు.

ఆర్యవైశ్యుల మద్దతు వైఎస్సార్‌సీపీకే



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వెలుగోడు: ఆర్యవైశ్యులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉంటారని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. బుధవారం పట్టణంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు అధిక ప్రాధాన్యత దక్కిందన్నారు. ఎంపీపీ పదవి లాలం రమేష్‌కు ఇచ్చి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆర్యవైశ్యులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించారన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్‌గా పువ్వాడి దివ్యా, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వార్డెన్ పోస్టు పువ్వాడి భాస్కర్‌కు ఇచ్చారన్నారు. ఇవేకాకుండా మన జిల్లాలలోనే మన కళ్లముందే అనేక డైరెక్టర్ పోస్టులు, నామినేటెడ్ పదవులు ఆర్యవైశ్యులకు ఇచ్చారని గుర్తు చేశారు. పేద ప్రజలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ ఫలాలు అందించడం వల్ల ప్రతి ఆర్యవైశ్య వ్యాపారాలు బాగున్నాయన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఈ ఎన్నికల్లో శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిల ఫ్యాన్ గుర్తుపై ప్రతి ఆర్యవైశ్యులు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

శిల్పాను గెలిపించాలని ఆర్యవైశ్యుల ప్రచారం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆర్యవైశ్య సంఘం యుజవన అధ్యక్షుడు పువ్వాడ భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులో ఆర్యవైశ్యులు అధికంగా ఉన్నారని, ప్రతి ఆర్యవైశ్యుడు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సుబ్బరామయ్య, రమేష్, సత్యనారాయణ, బాలాజీసాగర్, మణికంఠ పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట వేసిన జగనన్నను గెలిపిద్దాం



తాటిపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్.శ్రీలతారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



అలగనూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాల్లో పెద్దపీట వేసిన జగనన్నను గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ సతీమణి డాక్టర్ శ్రీలతారెడ్డి అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి అధ్వర్యంలో గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలతో పాటు రాజకీయాల్లో 50శాతం మహిళా రిజర్వేషన్లు అమలుచేసి సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలకు పెద్దపీట వేశారని తెలిపారు. జగనన్న ఐదేళ్ల పాలనలో తమ కుటుంబాలకు మేలు జరిగిందని భావిస్తే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యేగా దారా సుధీర్, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈమె వెంట డాక్టర్. వందన, కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, వైస్ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పెద్దరాయుడు, డిష్ మద్దిలేటి, బోయశీను తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మండ్లెం, తర్తూరు, 80బన్నూరు, పి.లింగాపురం, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు తోకలకృష్ణారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మండడిసతీష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి, ఎల్లారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎం మహేష్, పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, సుంకిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరమ్మ, గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, మండడి సతీష్‌రెడ్డి, వడ్డె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం

మిడుతూరు: అలగనూరులో సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, నాయకులు చిన్న రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, జమ్మన్న, చంద్ర, అలీబాషా, సర్వేశ్వరరెడ్డి, చిన్న రామచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, పుల్లారెడ్డి, అబ్దిల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని ఆంజనేయనగర్, పాలమర్రి ఏరియాలలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేస్‌నాయుడు గడప గడపకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పెరుమాళ్ల భాస్కర్, వైస్ ఎంపీపీలు పల్లె అరుణమ్మ, ఎంపీటీసీలు పగడం గోపాల్, మిద్దె స్వాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కరరెడ్డి, భూషిరెడి పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సుధీర్, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిలను గెలిపించుకోవాలని కోరారు. పాములపాడు మజరా కంబాలపల్లి గ్రామంలో జేసీఎస్ మండల కన్వీనర్ నాగరాజు ప్రచారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, లచ్చలగౌడు, రామిరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.



కంబాలపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ నాగరాజు



చెలిమిల్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి



ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

భారీ మెజార్టీతో ఆశీర్వదించండి

- సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- భారీగా వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఆత్మకూరు: మీ చల్లని ఆశీస్సులు, దీవెనలతో నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అభ్యర్థించారు. పట్టణ శివారులోని చెర్ల కాలనీలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలో అభిమానులు ఎమ్మెల్యేకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెర్ల కాలనీలో ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ అందిస్తున్నారని, ఇదే తరహాలో ఈ సారి కూడా మెజార్టీ అందించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలంటే వైఎస్సార్‌సీపీ పార్టీ మరలా అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అందవని, తెల్లవారుజామునే పింఛన్ అందించే వలంటీర్లు కనిపించరన్నారు. గతంలో చంద్రబాబునాయుడు రైతు రుణమాఫీ చెప్పాడని, మహిళలకు బంగారు తాకట్టు పెడితే రుణాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడన్నారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేసేందుకు పూనుకున్నాడన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో భారీ చేరికలు

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో భారీ చేరికలు జరిగాయి. నదిగడ్డకు 40 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆ కాలనీకి చెందిన రోషన్‌వలీ, ఖాదర్‌వలీ, మన్సూర్, బుజ్జి, ముర్తుజావలి, నూర్‌అహ్మద్, మహ్మద్‌షరీఫ్, షేక్షావలి, రఫిక్, మహేష్, సంసూర్, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 10వ తేదీన ఆత్మకూరు పట్టణంలో ఎన్నికల ప్రచారం భారీ రోడ్‌షో నిర్వహిస్తున్నామని, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సయ్యద్‌మీర్, అంజాద్‌అలీ పాల్గొన్నారు.

4 వేల మందికి ఇంటి స్థలాలు

చర్ల రహదారులు, సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కాలనీలో 4 వేల మంది పేదలకు సెంటున్నర స్థలం చొప్పున పట్టాలు అందించామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుత జగనన్న కాలనీల్లో ఇళ్లు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. త్వరలో ఆ ఇళ్లల్లో చేరితే ఆ కాలనీలు ఊర్లను తలపించనున్నాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సురేష్, జయన్న, రవీంద్ర, మహేష్, లక్ష్మన్నతో పాటు కాలనీప్రజలు పాల్గొన్నారు.

శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి



కృషి పండ్లతోట సంఘం రైతులతో మాట్లాడుతున్న శిల్పా కార్తీక్‌రెడ్డి



లింగాలగట్టులో ప్రచారం నిర్వహిస్తున్న తిలోత్తమరెడ్డికి స్వాగతం పలుకుతున్న మత్స్యకారులు



శ్రీశైలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రేగడగూడూరు గ్రామంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అంబాల ప్రభాకర్‌రెడ్డి దంపతులు



గాజులపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఈనెల 13న జరగబోయే శ్రీశైలం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి కోరారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని కృషి పండ్లతోటల సంఘం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు పలు సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలిఏటనే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.2 కోట్లకు పైగా నియోజకవర్గంలోని రైతులకు నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు. అలాగే సిద్ధాపురం చెరువు నుంచి సాగునీరు, తెలుగుగంగ కింద వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకున్నామన్నారు. రైతులు తమకు సహకరించి తన తండ్రి శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, మునీర్‌బాషా, పట్టణాధ్యక్షుడు సయ్యద్‌మీర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు సహకరించండి

వచ్చే ఎన్నికల్లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తన తండ్రి శిల్పా చక్రపాణిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి కోరారు. పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయంలో పదవీవిరమణ పొందిన ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఉప సర్పంచ్ కుటుంబానికి సంతాపం

ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామంలో ఉప సర్పంచ్ ఇమ్రాన్ బుధవారం ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందారు. విషయం తెలుసుకున్న శిల్పా కార్తీక్‌రెడ్డి హుటాహుటిన మృతుని ఇంటికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మత్స్యకారులకు శిల్పన్న కొండంత భరోసా

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు మత్స్యకారులకు శిల్పా చక్రపాణిరెడ్డి కొండంత భరోసానిచ్చాడని కృష్ణవేణి మత్స్యకార సహకార సంఘం నాయకులు కొండబాబు, మీనిగ చెన్నయ్య, ముడి. శ్రీను, జగ్గారావు, కోదండం, సోమేష్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా శిల్పా సోదరి తిలోత్తమరెడ్డి లింగాలగట్టులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మత్స్యకారుల అభ్యున్నతికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన సేవలు, అభివృద్ధి గురించి ఆమెకు వివరించారు. ప్రతి ఓటరు ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని తిలోత్తమరెడ్డి కోరారు. ప్రచారంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ జి.శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శిల్పా చక్రపాణిరెడ్డిని మరోసారి దీవించండి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్ బుధవారం శ్రీశైలంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. డమ్మీ ఈవీఎంతో ప్రజలకు ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఈ నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డికి ఒక ఓటు, ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డికి మరో ఓటు ఫ్యాను గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు టీఎండీ.రఫి, ప్రభావతి, పార్వతి, లక్ష్మీదేవి, కొటమ్మ, సవమ్మ, విష్ణు, ఏడుకొండలు, సీతారాం నాయక్, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

రేగడగూడూరులో ఎన్నికల ప్రచారం

వెలుగోడు: మండలంలోని రేగడగూడూరు గ్రామంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ అంబాల లక్ష్మీ సావిత్రమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, నాయకులు దుబ్బా సాయి ఈశ్వర్‌రెడ్డి, నందిరెడ్డిగారి రామిరెడ్డిలు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై రెండు ఓట్లు వేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

మహానంది: గాజులపల్లెలో ఎస్సీ కాలనీ, మేదర కాలనీ, సినిమా హాలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బంధువులు శిల్పా శ్రీలక్ష్మీ, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ బాచం రామేశ్వరి, గాజులపల్లె ఎంపీటీసీ వడుగూరి లక్ష్మీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి పర్యటిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తిమ్మాపురంలో మండల యువనేత ఒంటెద్దు వీరారెడ్డి, సొసైటీ చైర్మన్ పగడాల నాగరాజు, ఎంపీటీసీ స్వరూప, సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. మహానందిలో మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, మనోహర్‌రెడ్డి, భూమా సుబ్బరామయ్యలు ప్రచారం చేశారు. గోపవరంలో ఏవీ కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, బాలరాజుయాదవ్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

గంజాయి పట్టివేత

ఆత్మకూరు: శ్రీశైలంలోని ఎస్టీ కాలనీ వద్ద గ్రామానికి చెందిన బొడ్డపాటి మల్లికార్జున గంజాయి అమ్ముతుండగా శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రసాద్‌రావు, సిబ్బంది ఏఎస్‌ఐ గురవయ్య, సుంకన్న, రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, శివమహేంద్ర రెడ్డి పట్టుకున్నామన్నారు. అతని వద్ద ఉన్న 105 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

భార్యపై గొడ్డలితో దాడిచేసిన వ్యక్తికి రిమాండ్

కొత్తపల్లి: భార్యపై గొడ్డలితో దాడిచేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని శివపురం గ్రామంలో ఈనెల 3వ తేదీన గ్రామానికి చెందిన మార్తమ్మపై ఆమె భర్త వడ్డెమాన్ అర్జున్ గొడ్డలితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామని తెలిపారు. నిందితుడిని శివపురం గ్రామ శివారుల్లో అదుపులో తీసుకొని ఆత్మకూరు కోర్టులో హాజరు పరచగా.. ఇన్‌చార్జ్ జడ్జి వి.ఆదినారాయణ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పిడుగుపడి గడ్డివామి దగ్ధం

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి పిడుగుపడి రైతు సుదర్శన్‌కు చెందిన గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.2 లక్షలు దాకా ఆస్తినష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూరు: తన పది ఎకరాల పొలంతో పాటు 9 ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి, అరటితోటలను సాగు చేయగా మంగళవారం గాలివాన దెబ్బకు అరకొరగా కాసిన బొప్పాయి నేలరాలడంతో పాటు అరటి తోట పూర్తిగా నేలమట్టం కావడంతో భారీగా నష్టపోయానని పట్టణానికి చెందిన షేక్షావలి అనే రైతు వాపోయాడు. దీంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. తనకు హార్టికల్చర్ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి పంట నష్టపరిహారం అందించేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

గాలీవాన బీభత్సం

- 750 ఎకరాల్లో నేలకొరిగిన అరటి తోటలు
- కూలిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు
- సుమారు రూ. 6కోట్లు నష్టం



తిమ్మాపురం పరిధిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మహానంది: మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. మహానంది మండలంలో అత్యధికంగా సాగుచేస్తున్న పంటల్లో ప్రధాన పంట అరటి. ఈ మేరకు మంగళవారం రాత్రి వచ్చిన అకాలవర్షం, భారీగాలులకు సుమారు 750 ఎకరాల్లో అరటిపంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఉద్యానశాఖ అధికారి ఎం.శ్రీధర్ తెలిపారు. దీంతో సుమారు రూ. 6కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. నంద్యాల-మహానంది దారి పొడవునా భారీ వృక్షాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో పూరిగుడిసెలు, రేకుల షెడ్లు నేలకొరిగాయి. మండల పరిధిలోని మసీదుపురం, బొల్లవరం, నందిపల్లె గ్రామాల పరిధిలో 25 విద్యుత్ స్తంభాలు విరిగిపడినట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది కృషి చేశారని ఏఈ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

పాములపాడులో 38.8 మిల్లీ మీటర్ల వర్షం

పాములపాడు: మండలంలో బుధవారం తెల్లవారుజామున 38.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ వర్షం రైతులకు ఎంతో సంతోషాన్నిచ్చింది. పొలాలు వేసవి దుక్కులకు అనుకూలమయ్యాయని పేర్కొన్నారు.

46.4 మిల్లీ మీటర్ల వర్షపాతం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్ పేట, నాగలూటి, చింతలపల్లి, చెరుకుచెర్ల, కడుమూరు, పైపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రమైన మిడుతూరులో 46.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

జూపాడుబంగ్లాలో 40.6మిల్లీమీటర్లు..

జూపాడుబంగ్లా: మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షపాతం 40.6 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 48.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పగిడ్యాల మండలంలో 12.4మిల్లీమీటర్లు నమోదైనట్లు తెలిపారు. నందికొట్కూరులో 38.4మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు.